క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

పుట్టపర్తి: బుక్కపట్నం-1, బుక్కపట్నం-2 సచివాలయాల పరిధిలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభం అవుతుందని పార్టీ మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హాజరయ్యే కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, గృహసారథులు, వలంటీర్లు, అధికారులు పాల్గొలన్నారు.

పరామర్శ



మాజీ సర్పంచ్ రమణారెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

నల్లచెరువు: మండల పరిధిలోని నీలవాండ్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ రమణారెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కదిరిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి శుక్రవారం ఆయన్ను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య అందించాలని వైద్యులను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మదరసా అభివృద్ధికి విరాళం



ముసింలకు చెక్కు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, చేనేత ప్రముఖులు

ధర్మవరం అర్బన్: శివానగర్‌లో ఉన్న మసీదు, మదరసా అభివృద్ధికి శుక్రవారం చేనేత ప్రముఖులు, 6వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కాచర్ల అంజి, నాయకులు సిద్ధిరాజేష్, చింతా బాలకృష్ణ రూ.75 వేల చెక్కు అందించారు. మసీదు, మదరసాలో ఉన్న విద్యార్థుల సహాయార్థం, విరాళం అందించామని వారు తెలిపారు.

జగనన్న సురక్షపై నేడు అవగాహన

ధర్మవరం రూరల్: సమస్యలను సంతృప్తి స్థాయిలో పరిష్కరించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సౌజన్య కుమారి శుక్రవారం తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 23 నుంచి జూలై 23 వరకూ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

తలుపుల ఎంపీడీఓగా కిరణ్‌కుమార్ రావు



తలుపుల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నూతన ఎంపీడీఓగా బి.కిరణ్‌కుమార్ రావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కడప విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో ఏఓగా విధులు నిర్వర్తిస్తూ పదోన్నతిపై ఎంపీడీఓగా ఇక్కడికి వచ్చారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతన ఎంపీడీఓ తెలిపారు.

మున్సిపల్ చైర్‌పర్సన్‌కు సన్మానం



మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

ధర్మవరం రూరల్: వాసవి కన్యకా పరమేశ్వరి స్వామి దేవాలయంలో శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, కాచర్ల అంజి దంపతులను ఆర్యవైశ్యులు సన్మానించారు. అంతకు ముందు చైర్‌పర్సన్‌కు ఆర్యవైశ్య అనుబంధ సంఘాల సభ్యులు ఘనంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

మస్తాన్‌వలి దర్గా కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

కొత్తచెరువు: మండల కేంద్రంలోని మస్తాన్ వలి దర్గా నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అజీజ్ రహిమాన్, ఉపాధ్యక్షుడిగా అస్లాం బాషా, సెక్రటరీగా మహమ్మద్ ఇసాక్‌తో పాటు 10 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. దర్గా అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

రాబోవు రోజుల్లో మరింత సంక్షేమం

- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు సిద్దారెడ్డి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి



కదిరి టౌన్: పథకాల లబ్ధిపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి



ధర్మవరం: సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

కదిరి టౌన్: కలమతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని మూర్తిపల్లి సచివాలయం పరిధిలోని మూర్తిపల్లి, వికలాంగుల కాలనీ, ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి.. కాలనీలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. పలు సమస్యలను వెంటనే పరిష్కరించారు. పరిష్కారం కాని సమస్యలపై అధికారులతో మాట్లాడారు. త్వరితగతిన సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన చోట్ల సిమెంట్ రోడ్లు, డ్రైన్‌లు వేసేందుకు ఎస్టిమేట్లు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. రాష్ట్రంలో ఒక వైపు సంక్షేమం మరొక వైపు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన సీఎం జగన్ ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దారన్నారు. ఇది ఓర్చుకోలేని టీటీపీ లేనిపోని ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. ఎవరు ఎన్ని చెప్పినా.. నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. సీఎం జగన్ రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, మాజీ సమన్వయ కర్త ఎస్ఎండీ ఇస్మాయిల్, వార్డు కౌన్సిలర్ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపుతాం..

ధర్మవరం: మున్సిపాలిటీ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు చేపడుతామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం 24వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వార్డులో ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఇంటింటికీ తిరిగి ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన సిద్దయ్యగుట్ట, పార్థసారథి నగర్, జోగోని కుంట తదితర కాలనీల్లో అస్తవ్యస్త డ్రైనేజీతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత మున్సిపల్ పాలకవర్గం ఇష్టానుసారం ప్రణాళిక లేకుండా నిర్మించిన డ్రైన్‌లతో ఈ సమస్య నెలకొందన్నారు. ఇందుకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కాలనీలో డ్రైన్‌లకు మరమ్మతులు చేస్తామన్నారు. అలాగే కొత్త డ్రైన్‌లను ఏర్పాటు చేసేలా అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ప్రజా రంజక పాలన సాగుతోందన్నారు. పేదల ప్రభుత్వానికి పెత్తందారులకు మధ్య జరుగుతున్న యుద్ధంలో ప్రజా దీవెనలతో వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధిస్తుందని దీమా వ్యక్తం చేశారు. వంద శాతం హామీలను అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో హామీలతో మోసం చేసిన చంద్రబాబుకు ఓటమి తప్పదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మెన్లు ఎర్రగుంట భాగ్యలక్ష్మి, పెణుజూరు నాగరాజు, వార్డు కౌన్సిలర్ గోరకాటి పురుషోత్తం రెడ్డి, పట్టణ సచివాలయాల కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభకు పట్టం



నల్లమాడ: విద్యార్థికి పురస్కారం అందజేస్తున్న ఉపాధ్యాయులు



నల్లచెరువు: జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

నల్లచెరువు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం జరిగింది. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన ఎస్.తౌఫిక్, ఎస్.దినేష్ కుమార్, ఎన్.దీపక్ కుమార్‌కు ఎంపీపీ రమణారెడ్డి, సర్పంచ్ పంచరత్నమ్మ తదితరులు పురస్కారాలు ప్రదానం చేశారు. విద్యార్థులను పూలమాలలతో సత్కరించి, నగదు బహుమతులు అందజేశారు. ఎంపీపీ రమణారెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగానికి అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. పిల్లల తల్లిదండ్రులకు విద్య భారం కాకూడదని జగనన్న అమ్మఒడి పథకం ద్వారా నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాలోకి డబ్బులు వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నారాయణ స్వామి, ఎంఈఓ తిరుపాల్ నాయక్, ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, సింగల్ విండో డైరెక్టర్ ఆదిమూర్తి, పేరెంట్స్ కమిటీ వైస్ చైర్మన్ మదార్‌వలి పాల్గొన్నారు.

నల్లమాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బి.మహేంద్ర, ఆర్.దామోదర్ నాయక్, బి.నిఖిల్ సాయికి పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ వేమనారాయణ, హెచ్ఎం భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. పేద విద్యార్థులను చదువులో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పురస్కారాలు అందజేస్తోందన్నారు. బాగా చదువుకుని, ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కుటుంబాలు

ముదిగుబ్బ: అడవి బ్రాహ్మణపల్లికి చెందిన వెంకటనారాయణ ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన 17 కుటుంబాలు శుక్రవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే తన నివాసంలో వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో చిన్న బయన్న, పెద్ద వెంగప్ప, లక్ష్మీదేవి, బాల వెంగముణి, సులోచన, మురళి, అనిత, వెంగల్ రాయుడు, ప్రమీలమ్మ, చిన్న బాలకృష్ణ, వెంకటరమణ, సురేంద్ర, పుల్లయ్య, చిత్ర, ఎం.అనిత, హేమావతి, రమాదేవి ఉన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి చేస్తున్న అభివృద్ధికి మెచ్చి తామంతా వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి ఇందుకూరి నారాయణరెడ్డి, నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, కిరణ్ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



కొత్తచెరువు: జగనన్న విద్యాకానుక కిట్లు అందజేస్తున్న దృశ్యం



ఓడీ చెరువు: విద్యాకానుక కిట్లను చూపుతున్న విద్యార్థులు

బత్తలపల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద విద్యార్థులను గొప్ప విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నారని పోట్లమర్రి సర్పంచ్ అక్కిం దామోదర్, హెచ్ఎం విజయవాణి అన్నారు. శుక్రవారం మండలంలోని వేల్పుమడుగు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని పాఠశాల శిథిలావస్థకు చేరుకుని కూలేందుకు సిద్ధంగా ఉండేదన్నారు. అయితే మన బడి నాడు-నేడు కింద పాఠశాలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కార్పొరేట్‌ను తలదన్నేలా ప్రభుత్వ బడులు తయారవుతున్నాయన్నారు. విద్యా కానుక, జగనన్న గోరుముద్ద కార్యక్రమాలతో సీఎం జగన్ విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకొస్తున్నారని తెలిపారు. అనంతరం పాఠశాలలోని 26 మంది విద్యార్థులకు కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోళ్లమొర్రం చెన్నకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకుడు నరేంద్రరెడ్డి, ఉపాధ్యాయుడు రామాచారి పాల్గొన్నారు.

ఓడీచెరువు: చింతమానుపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పింపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ జగన్‌మోహన్ చౌదరి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. పుస్తకాలు, బెల్టు, షూ, సాక్స్, దుస్తులను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్ బాబు, ఉపాధ్యాయురాలు రేష్మా పాల్గొన్నారు.

కొత్తచెరువు: కొడపగానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ అలివేలమ్మ శుక్రవారం విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చలపతి, ఉపాధ్యాయులు శశికళ, రమేష్‌రెడ్డి, లక్ష్మీకాంత్, విశ్రాంత ఉపాధ్యాయుడు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో కచ్చితమైన భూ కొలతలు



ముక్తాపురంలో గ్రామసభ నిర్వహిస్తున్న సర్వేయర్, రెవెన్యూ అధికారులు

కనగానపల్లి: ప్రభుత్వం చేపట్టిన జగనన్న భూ రీసర్వే-భూ రక్ష కార్యక్రమం ద్వారా భూములకు కచ్చితమైన కొలతలు నిర్ధారణ చేయబడతాయని సర్వేయర్ స్టీఫెన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ముక్తాపురంలో భూసర్వే కార్యక్రమంపై రెవెన్యూ, సర్వే అధికారులు స్థానిక రైతులతో గ్రామసభ నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ ముక్తాపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని పర్వతదేవపల్లి, ముక్తాపురం, మామిళ్లపల్లి, కొండ్రెడ్డిబాయి గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తామన్నారు. సర్వే సమయంలో భూ హక్కుదారులకు సమాచారం అందించి, వారు ఇచ్చిన హక్కు పత్రాల మేరకు వివరాలు నమోదు చేస్తామన్నారు. సర్వేను రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ల వరుస సంఖ్య ప్రకారం మొదటి నుంచి చివరి దాకా చేసుకొంటుపోతామన్నారు. సమావేశంలో వీఆర్వో చెన్నకేశవులు, పంచాయతీ కార్యదర్శి వెంకటరాముడు, గ్రామ సర్వేయర్ తులసి, స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రూ.82 లక్షలతో ఆర్బీకే గోడౌన్ నిర్మాణం



భూమి పూజ చేస్తున్న ఎంపీపీ బగ్గిరి త్రివేణి

బత్తలపల్లి: మండలంలోని గుమ్మల్లకుంట ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సహకారంతో రూ.82 లక్షలతో నిర్మించనున్న ఆర్బీకే గోడౌన్ నిర్మాణానికి ఎంపీపీ బగ్గిరి త్రివేణి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకునేందుకు గోడౌన్ ఉపయుక్తంగా ఉంటుందన్నారు. వ్యవసాయ రంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. రైతులు గోడౌన్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అగ్రికల్చర్, మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్ డీఈ రఘునాథ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప తదితరులు పాల్గొన్నారు.

ఖాద్రీ ఆలయంలో వరుణ పారాయణం

కదిరి టౌన్: సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం వరుణ పారాయణం చేపట్టారు. పండతుడు రవీంద్ర శర్మ మహాభారతంలోని విరాట పర్వం పారాయణమును మొదలు పెట్టారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వెండిదండి శ్రీనివాసరెడ్డి, ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారధిచార్యులు, అంజన్‌కుమార్ చార్యులు, ముఖ్య అర్చకుడు సుబ్రహ్మణ్యం శర్మ పాల్గొన్నారు.

జూలైలో బీసీ గర్జన

కదిరి అర్బన్: పట్టణంలో జూలై నెలలో 20 వేల మందితో బీసీ గర్జన సభ నిర్వహిస్తున్నట్లు రాజ్య సభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ క్రిష్ణయ్య, బత్తల వెంకటరమణ తెలిపారు. శుక్రవారం వారు ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 50 శాతం రిజర్వేషన్ ప్రధాన డిమాండ్‌గా ఈ కార్యక్రమం జరగనుందని పేర్కొన్నారు. అలాగే బీసీ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డా.బత్తల హరిప్రసాద్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారేష్ పేర్కొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి

పుట్టపర్తి అర్బన్: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని వైద్యాధికారులు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని జగరాజుపల్లిలో మలేరియా నివారణ మాసోత్సవాలు నిర్వహించారు. వైద్య సిబ్బంది గ్రామంలో ర్యాలీ చేపట్టారు.

తాడిమర్రి: పరిసరాల పరిశుభ్రతతో దోమలను నివారించొచ్చని పీహెచ్ఎన్ లక్ష్మీదేవి గ్రామస్తులకు సూచించారు. శుక్రవారం డ్రైడే-ఫ్రైడే సందర్భంగా మండల కేంద్రంలో వైద్య సిబ్బంది పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. పలు వీధుల్లో సిబ్బందితో కలసి పర్యటించారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. నీటి తొట్టెలను శుభ్రం చేయించారు.

కరుణించు.. వరుణదేవా



కనికెల కొండలో పూజలు చేస్తున్న భక్తులు

ఓడీ చెరువు: దొన్నికోటవారిపల్లి కనికెల కొండలో వెలసిన అక్కదేవతలకు శుక్రవారం ఎలువగంప ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. వరుణ దేవుడు కరుణించి సకాలంలో వర్షాలు కురవాలని పూజలు చేశారు. మల్లెపూలతో అలంకరించిన వెదరుగంపలో అక్కదేవతలను కొలువుదీర్చారు. గ్రామ వీధుల్లో ఎలువగంప ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు.

'పశుబీమా'ను సద్వినియోగం చేసుకోండి

గాండ్లపెంట: మండలంలోని పాడి రైతులందరూ ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ పశుబీమాను సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి చెన్నకేశవులు నాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రమాదవశాత్తూ, వివిధ రోగాల బారినపడి పశువులు మృతి చెందితే పాడి రైతులు నష్టపోకుండా ప్రభుత్వం బీమా చెల్లిస్తుందన్నారు. పశువు విలువ రూ.15,000 అయితే ప్రీమియం రూ.960, రూ.30 వేలు విలువ చేసే పశువు అయితే రూ.1,920 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులు కుల ధ్రువీకరణ పత్రం జత చేయాల్సి ఉంటుందన్నారు.

అదనపు స్టేజీల ఏర్పాటు

కదిరి అర్బన్: కదిరి నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికుల కోరిక మేరకు ముదిగుబ్బ, బత్తలపల్లి, ఎస్కే యూనివర్సిటీ, గుత్తిలో ఇంద్ర బస్సుకు స్టేజీలు ఏర్పాటు చేసినట్లు డీఎం మైనుద్దీన్ శుక్రవారం పేర్కొన్నారు. ఈ బస్సు రోజూ రాత్రి 9:30 గంటలకు కదిరిలో బయలు దేరుతుందన్నారు. కదిరి నుంచి హైదరాబాద్‌కు రూ.1,050, బీహెచ్ఈఎల్‌కు రూ.1,100 చార్జీ ఉంటుందన్నారు. సీనియర్ సిటిజన్లకు టికెట్‌పై 25 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక

నల్లచెరువు: మండల కేంద్రంలోని దామోదర్ మిషన్‌లో శుక్రవారం ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ రవి కుమార్, మండల నాయకులు తిరుపాల్, శ్రీరాములు ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా ఆదినారాయణ, అధ్యక్షుడిగా పి.మహేంద్ర, ఉపాధ్యక్షుడిగా వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా అశోక్ కుమార్, గౌరవ అధ్యక్షుగిగా బి.ఆదినారాయణ,సెక్రెటరీగా జె.ఆంజనేయులును ఎన్నుకున్నారు.


మధ్యాహ్న భోజనం పరిశీలన

నల్లచెరువు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని శుక్రవారం ఎంపీపీ రమణారెడ్డి, ఎంఈఓ తిరుపాల్ నాయక్, వైస్ ఎంపీపీ నారాయణ స్వామి పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో రాజీపడొద్దన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.

'దళితుల భూములకు రక్షణ కల్పించాలి'

ముదిగుబ్బ: దళితుల భూములకు రక్షణ కల్పించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జన్నే చిరంజీవి, రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు రామాంజినేయులు చిన్నకోట్ల గ్రామంలో పర్యటించారు. గ్రామానికి చెందిన సాకే అక్కులప్ప కుటుంబానికి ప్రభుత్వం 354 సర్వే నెంబర్‌లో 5 ఎకరాల గల భూమిని పంపిణీ చేసిందన్నారు. అయితే ఈ భూమిని చిన్నకోట్లకు చెందిన తలారి బాలప్ప ఆక్రమించుకుని.. సదరు భూమిని పెద్ద కుళ్లాయప్ప, ఎర్రప్ప, గంగప్పకు విక్రయించినట్లు తెలిపారు. సాకే అక్కులప్ప కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం వీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాళ్లపల్లి చంద్రశేఖర్, సాకే నరసింహులు, పక్కీరప్ప తదితరులు పాల్గొన్నారు.

సౌభాగ్య గంగమ్మ విగ్రహ ప్రతిష్ట



ఎన్పీకుంట: యర్రవంకలవారిపల్లిలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో శుక్రవారం సౌభాగ్య గంగమ్మ విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఆలయం వద్ద రెండు రోజులుగా వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం మంటపారాధన, పారాయణం, యంత్ర ప్రతిష్ట, ప్రాణప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, జ్వాలా దర్శనం, బింబదర్శనం, మహాపూర్ణాహుతి చేపట్టారు. విష్ణువర్దన్ రెడ్డి రూ.20,116లకు మొదటి పూజ హక్కులను వేలంలో దక్కించుకున్నారు. వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులు రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరి దేవి కట్టకు పూజలు

ధర్మవరం: పట్టణంలోని మాధవనగర్‌లో నూతనంగా నిర్మించిన చౌడేశ్వరి దేవి కట్టకు మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, కౌన్సిలర్లు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం వార్డు కౌన్సిలర్ కేతా లోకేష్ ఆధ్వర్యంలో తొగటవీర క్షత్రీయ కులస్తులు చౌడేశ్వరి దేవి కట్టను నిర్మించారు. అనంతరం చైర్‌పర్సన్‌ను కౌన్సిలర్లు, తొగటవీర క్షత్రీయ కులస్తులు శాలువాలతో సన్మానించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతి చెందిన పెద్దన్న

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎరగుంట మేడాపురం క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వివరాలు.. కత్తెకొట్టాల గ్రామానికి చెందిన పెద్దన్న (46) ఈనెల 2వ తేదీ రాత్రి ద్విచక్ర వాహనంలో ధర్మవరం నుంచి గ్రామానికి బయలుదేరాడు. ఎరగుంట మేడాపురం క్రాస్ వద్ద వెనుక వైపు నుంచి బొలెరో వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పెద్దన్నను బెంగళూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బాలలను పనిలో పెట్టుకోవద్దు

కదిరి అర్బన్: పట్టణంలో శుక్రవారం చైల్డ్ రెస్క్యూ టీం దాడులు నిర్వహించి ఆరుగురు బాల కార్మికులను గుర్తించారు. 18 ఏళ్లలోపు పిల్లలను పనుల్లో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. పిల్లలను పాఠశాలల్లో చేర్పిస్తామని తెలిపారు. దాడుల్లో చైల్డ్ లేబర్ ఆఫీసర్ జహీరుద్దీన్, చైల్డ్ డ్రైవ్‌స్వాడ్ చెన్నకృష్ణ, మానిటరింగ్ ఆఫీసర్ అబ్దుల్ మాలిక్ పాల్గొన్నారు.

నేడు పురస్కారాల ప్రదానం

కదిరి అర్బన్: మండలంలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు హరిత నేస్తం సంస్థ ఆధ్వర్యంలో శనివారం పురస్కారాలు అందజేయనున్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు రాయసం హరిప్రసాద్ తెలిపారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ఎన్పీకుంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు ఎంఈఓ గోపాల్‌నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయులు తిరుపాల్‌నాయక్, డి.వి. శ్రీనివాసులు, ఉర్దూ ఉపాధ్యాయుడు సమీవుల్లా, ఉపాధ్యాయిని సాయిలీలకు ఘనంగా వీడ్కోలు పలికారు.

పబ్లిక్ నోటీస్

నా కక్షిదారుడు కడియంపాటి హర్షవర్దన్ తండ్రి కె. ఈశ్వరచారి, డి.నెం.6/45, కర్నాల స్ట్రీట్, కదిరి, శ్రీ సత్యసాయి జిల్లా తరుపున ఇవ్వబడిన పబ్లిక్ నోటీస్.

నా కక్షిదారుడు క్రింద షెడ్యూలు ఆస్తిని కోదూరు ఈశ్వర్ తండ్రి వెంకట అరుణ్ బాబు మరియు రాయిపెద్ది కళ్యాణి భర్త వెంకట అరుణ్ బాబు, డి.నెం. 26/1007-1సి, మిట్టమాడి స్ట్రీట్, ప్రొద్దుటూరు, వై.యస్.ఆర్. జిల్లా గారి నుండి కొనదలచినాడు. కావున సదరు ఆస్తిపై ఎవరికైనా, తనఖాలు క్లైమ్‌లు, అటాచ్‌మెంట్లు లేదా విక్రయ అగ్రిమెంటులు, ఏవైనా అభ్యంతరాలు వున్న యెడల ఈ క్రింది చిరునామాలో 7 దినములు లోపున తెలుపుకోవలసినదిగా యవన్మందికి తెలియజేయడమైనది. అట్లు కాని యెడల నా కక్షిదారుడు క్రింది షెడ్యూలు ఆస్తిని కొనడానికి ఎటువంటి ఆక్షేపణలు లేవని భావించును. తదుపరి ఎటువంటి క్లైమ్‌లు చెల్లనేరవు అని ఇందుమూలంగా యావన్మందికి తెలియచేయడమైనది.

షెడ్యూలు

శ్రీ సత్యసాయి RD కదిరి SRD కదిరి మండలం, కదిరి పోలం వివరం.

సర్కారు ఖుష్కి S.No. 222-3, A.C. 0.45 పైకి 0.15 సెంట్లు.
తూర్పు : జి. కమలమ్మ భూమి; **పడమర :** రస్తా ; **ఉత్తరం:** జి. నరసింహులు భూమి; **దక్షిణం :** జిన్నావలి భూమి.

జి. ప్రసాద్ రెడ్డి, B.A., B.L., అడ్వకేట్
డి.నెం. 14-3-12-5al, దా॥ వై.యస్.ఆర్. నగర్,
కదిరి - 515 591, శ్రీ సత్యసాయి జిల్లా (ఎ.పి.)